క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీవోగా కృష్ణారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణారావు

లింగాపూర్: మండల కేంద్రంలో ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన రామేశ్వర్‌రావు శనివారం గుండెపోటుతో మృతిచెందారు. కాగా ఆయన స్థానంలో సిర్పూర్ (యూ) ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు ఆదివారం లింగాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

'సింహగర్జన'కు తరలిన మాలలు

కౌటాల: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన 'హలో మాల.. చలో హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మాలల సింహగర్జన కార్యక్రమానికి మండలంలోని మహర్ కులస్తులు, మాలలు అధికంగా తరలివెళ్లారు. మోతీరాం, వెంకటేశ్, గోవింద్‌రావు, దేవాజీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని ఆదివారం మండల విద్యాధికారి జయరాజ్, ఎంపీవో సుధాకర్ రెడ్డిలు తనిఖీ చేశారు. విద్యాలయంలోని పరిసరాలు, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వంట గది, భోజనశాలలను పరిశీలించారు. వంట విధానాన్ని పరిశీలించి విద్యార్థులతో భోజనం చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

9న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్ రావు తెలిపారు. పాఠశాల ప్రారంభం నుంచి 2023 –24 పదో తరగతి బ్యాచ్ వరకు పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. ఆదివారం పాఠశాలలో మహాసమ్మేళన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సాయిని సంతోష్, అధ్యక్షుడిగా గద్దలపెల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వాసుదేవన శైలేష్, ముత్యాల ప్రదీప్, కార్యదర్శిగా ఇరుకుల్ల శ్రీనాథ్, సహాకార్యదర్శిగా పోలంపెల్లి రాజశేఖర్, పుల్లూరి సంతోష్, కల్లూరి సంతోష్, కోశాధికారిగా జంజిరాల సతీశ్, ప్రచారకర్తగా కలకుంట్ల శ్రీధర్, సలహా మండలి సమితి కన్వీనర్‌గా కొలిప్యాక వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా తాటిపెల్లి జ్యోతిని ఎన్నుకున్నారు. పూర్వ ఆచార్య కన్వీనర్‌గా చందావార్ బాలేశ్వర్ ఉంటారన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఇన్‌చార్జి శ్రీరాం సత్యనారాయణ పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన మహిళకు 108 వాహనం సిబ్బంది కాన్పు చేశారు. గ్రామానికి చెందిన గర్భిణీ డోకె రజితకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. చేడ్వాయి నుంచి కాగజ్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలిస్తున్న క్రమంలో ఈస్గాం వద్ద పురిటినొప్పులు అధికం కావడంతో సిబ్బంది డెలివరీ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ శంకర్, పైలెట్ ఎస్కే ఖలీద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పత్తి దగ్ధం



కాలిన పత్తితో రైతు

కెరమెరి: మండలంలోని పరస్వాడ గ్రామానికి చెందిన రాథోడ్ శంకర్ పత్తి పంట ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఇంట్లో పత్తి పంట నిల్వ ఉంచగా షార్ట్ సర్క్యూట్‌తో 4 క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. గ్రామస్తులు వచ్చి నీరు పోయడంతో మంటల వ్యాప్తి జరగలేదు. కాగా గ్రామం నుంచి కెరమెరి రావాలంటే రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అనేక మంది రైతులు ఇంట్లో పత్తి నిల్వ ఉంచుకుంటున్నారు.

ఆఖరు మజిలీ కష్టాలు..!

- నిరుపయోగంగా శ్మశానవాటికలు
- కనీస సౌకర్యాలు కరువు
- ఒర్రెలు, రహదారులపైనే దహన సంస్కారాలు
- పట్టించుకోని అధికారులు



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా శ్మశానవాటిక

ఆసిఫాబాద్అర్బన్: గత కొన్ని సంవత్సరాల క్రితం పెద్దవాగు నదీ తీరాన నిర్మించిన శ్మశాన వాటిక నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో శ్మశాన వాటికలు నిర్మించింది. కానీ జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని చాలా వరకు శ్మశానవాటికలు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోవడం లేదు. మండలంలో మొత్తం 27 జీపీల్లో వైకుంఠధామాలను నిర్మించగా పూర్తి స్థాయిలో వసతులు కల్పించకపోవడంతో ప్రస్తుతం కనీసం 90శాతం వరకు వినియోగంలోకి రాలేదు.

నిత్యం ఇబ్బందులే..

మూడు కాలాలు అంతిమ దహన సంస్కారాలకు జిల్లా కేంద్రంలోని ప్రజలకు ఇబ్బందులే. ముఖ్యంగా వర్షాకాలం దురదృష్టావత్తు ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు నరకం చూడాల్సిందే. జిల్లా కేంద్రంలో సుమారు 40వేలకు పైగా ఉన్న జనాభాకు కనీసం నాలుగు ప్రాంతాల్లో స్మశానవాటికలు నిర్మించాలన్న డిమాండ్ ప్రజల్లో ఉంది. ఎట్టకేలకు ఒక్కటి నిర్మాణం చేపట్టగా అదీ అరకొర వసతులతో ఉండడంతో వాగులు, వంతలు, ఒర్రెల సమీపంలో రోడ్లపైనే దహనసంస్కారాలు చేస్తున్నారు. ఆకస్మాత్తుగా వాగులు పొంగితే దహన సంస్కారం చేసిన వ్యక్తికి సంబంబదించి పూర్తిగా వాగులో పోవడంతో జరగాల్సిన కార్యక్రమాలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే..మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరీ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి స్మశాన వాటికలో కావల్సిన కనీస వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అక్కడ దహన సంస్కారాలు జరగడం లేదు. శ్మశానవాటికలో విద్యుత్, నీటి సౌకర్యంతో పాటు రహదారిని కూడా ఏర్పాటు చేయాలి. జిల్లా కేంద్రంలో ఉన్న జనాభా దృష్టిలో పెట్టుకుని దీనికి తోడు మరో మూడు శ్వశాన వాటికలను వేరువేరు ప్రాంతాల్లో నిర్మించాలి. – పిన్నా మహేశ్

కనీస సౌకర్యాలు కల్పించాలి



జిల్లా కేంద్రంలో కనీసం నాలుగు శ్మశాన వాటికలు అవసరమున్నా ఒకటి మాత్రమే నిర్మించారు. అందులో కూడా కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా శ్మశానవాటికలో కనీస వసతులు కల్పించి ప్రజల ఇబ్బందులు దూరం చేయాలి. – ఆవిడపు ప్రణయ్‌కుమార్

త్వరలో వసతులు కల్పిస్తాం

మండలంలో ఇప్పటి వరకు ఉన్న 27 జీపీలలో 27 శ్మశాన వాటికలను పంచాయతీరాజ్, శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ నిధులతో నిర్మించారు. వైకుంఠధామాల్లో నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపడుతాం. – మౌనిక, ఎంపీవో, ఆసిఫాబాద్

ఎయిడ్స్ నివారణకు జాగ్రత్తలు పాటించాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రి నుంచి అంబేద్కర్ చౌక్ మీదుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ అజ్మత్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి, ఆరోగ్య కేంద్రాల్లో ఎయిడ్స్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ సతీశ్, ల్యాబ్ టెక్నిషియన్ ఎండీ రవూఫొద్దీన్, హెల్త్ సూపర్‌వైజర్ ఉత్తం, ఆశ సిబ్బంది చేతన, ఎన్‌జీవో సతీశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడె మోసిన కోనప్ప



పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు చకినాల దేవయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దేవయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని దేవయ్య పాడె మోశారు. సీనియర్ నాయకులు నక్క శంకర్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దంపతులు పరామర్శించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూర్: బెజ్జూర్ రేంజ్ పరిధిలో పులి సంచరి స్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చి న్న సిద్దాపూర్ ఎఫ్‌బీవో వెంకటేశ్ అన్నారు. చి న్న సిద్దాపూర్, పెద్ద సిద్దాపూర్ గ్రామాల్లో ఆది వారం రాత్రి రైతులకు అవగాహన కల్పించా రు. పాపన్నపేట్ బీట్ అధికారి గోపాల్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

'అడవికి నిప్పు వన్యప్రాణులకు ముప్పు'



అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: అడవికి నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులకు ముప్పు కలుగుతుందని వావుదాం బీట్ అధికారి అమరేందర్ అన్నారు. ఆదివారం మండలంలో గంటలగూడ, కాప్రి, బనార్ గొంది గ్రామ ప్రజలకు 'అడవికి నిప్పు పర్యావరణ ముప్పు అటవీ జంతుల సంరక్షణ'పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలం నేపథ్యంలో అటవీ ప్రాంతాలకు వెళ్లే పశువుల కాపరులు నిప్పు వెలిగించకూడదన్నారు. నిప్పు వల్ల అటవీ ప్రాంతం కాలిపోయి పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. గిరిజనులు గతంలో ఇచ్చిన ఆర్‌వోఆర్ పట్టాలు ఉన్నంత వరకు సాగు చేసుకోవాలన్నారు. ఎక్కువ సాగు చేస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పులి పాదముద్రల వదంతులు



సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన ఫొటో

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ గ్రామానికి సమీపంలోని రైతు కూరగాయల తోటలో పులి పాదముద్రలున్నట్లు ఆదివారం వదంతులు వినిపించాయి. పాదముద్రల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో గంగాపూర్ వాసులతో పాటు మండలంలోని ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. విషయం తెలుసుకున్న రెబ్బెన అటవీశాఖ అధికారులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పాదముద్రలను పరిశీలించి అవి కుక్క పాదముద్రలుగా నిర్ధారించారు.పులి సంచరిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శ్రీరామచంద్ర మిషన్‌లో సామూహిక ధ్యానం



సామూహిక ధ్యానం చేస్తున్న అభ్యసకులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ రామచంద్ర మిషన్‌లో శనివారం రాత్రి రీజనల్ ఫెసిలేటర్ కొత్తపెల్లి మధు, జెడ్‌సీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక ధ్యానం నిర్వహించారు. గోలేటిలోని శ్రీరామ చంద్రమిషన్ ఆశ్రమాన్ని సందర్శించి ఆశ్రమంలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ధ్యానంతో ఎన్నో లాభాలు ఉన్నాయని, ప్రతీ ఒక్కరు ధ్యానం ప్రాముఖ్యత గుర్తించాలన్నారు. నిరంతర ధ్యానంతో మనసుకు ప్రశాంతత చేకూరడంతోపాటు ఏకాగ్రత పెరిగి మానసిక ఒత్తిడి దూరమవుతుందని పేర్కొన్నారు. అనంతరం సామూహిక సత్సంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆసిఫాబాద్ సీసీ జయ, దీపక్, ఆశ్రమ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.బ్రహ్మానందం, అనిల్‌కుమార్, బాబురావు, మహేందర్, ఉజ్వల్‌కుమార్ బెహరా, మల్రాజు శ్రీనివాస్‌రావు, రాజ్‌కుమార్, వీరస్వామి, రామకృష్ణ, ఓరం కిరణ్, రాంబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన నాగిళ్ల రవీందర్ రచించిన ట్రాన్స్ మహిళామణులు అనే పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని చైతన్య సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో నిర్వహించారు. కార్యక్రమానికి గురిజాల రవీందర్, మేడిచరణ్‌దాస్, మహిపాల్, రాజ్‌కమలాకర్ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ఉన్నత పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: ప్రజాపాలన, ప్రజావిజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'పునరుత్పాదక ఇంధన వనరులు' అనే అంశం మీద కొనసాగిన పోటీలు ఆశ్రమ ఉన్నత పాఠశాల మోడి, అనార్‌పల్లి, హట్టిలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెరమెరిలలో నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జయశ్రీ (మోడి), రాజేశ్(హట్టి), బద్రు (అనార్‌పల్లి), పవిత్ర (మోడి) విద్యార్థులకు బహుమతులను ఎంఈవో ఆడే ప్రకాశ్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్, నర్సయ్య, సురేశ్, నందిని, యోగేశ్, వినీత్, శివ, రాజేశ్వరి, సరిత తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో గావుడే హన్మంతు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన సాయికృష్ణ, గంగ, సాయి చరణ్యలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు శ్యాంరావు, శ్రీనివాస్, సీఆర్పీలు దేవన్న, లాలాజీ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైక్‌లు.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు



వైన్స్‌ల ఎదుట నిలిపిన వాహనాలు

కౌటాల: కౌటాల– విజయనగరం రహదారికి ఇరువైపులా రెండు వైన్స్ షాపులు ఉండగా మందుబాబులు మద్యం కోసం బారులుదీరి రోడ్డుపైనే బైక్‌లను నిలిపారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దుకాణాల పక్కనే ఉన్న ఇళ్ల ముందు మందుబాబులు మద్యం సేవించి మద్యం మత్తులో బీరుసీసాలు పగలగొట్టడం, మూత్ర విసర్జన చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైన్స్‌షాపులను జనవాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఎల్లిపాయలు @ రూ.400



కెరమెరి: ఎల్లిపాయల ధరలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన వారసంతలో కిలో ఎల్లిపాయలు రూ.400 పలికాయి. కాగా ఉల్లిగడ్డలు కిలో రూ.50 పలికాయి. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. ధర పెద్ద మొత్తంలో పెరగడంతో చాలా మంది కొనుగోలు చేయకుండానే వెనుదిరిగారు.

గుబులు పుట్టిస్తున్న 'ఫెంగల్'!



దహెగాం కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

- ముమ్మరంగా వరి కోతలు, పత్తితీత పనులు
- కల్లాల్లోనే ధాన్యం
- వర్షం పడితే నష్టమే

దహెగాం: గత రెండు రోజులుగా ఫెంగల్ తుపాను కారణంగా మబ్బులు గుబులు పుట్టిస్తున్నా యి. రెండు రోజుల నుంచి వాతావరణంలో మా ర్పుల వల్ల చలి తీవ్రత తగ్గింది. మబ్బులు వస్తున్నందున అన్నదాతలు ఆందోళన చెందుతున్నా రు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో ఫెంగల్ తుపా ను ప్రభావం తీవ్రంగా ఉండడంతో తెలంగాణలో కూడా కొంతమేర తుపాను ప్రభావం పడేలా ఉంది. శనివారం సాయంత్రం కాగజ్‌నగర్ పట్టణంలో చిరుజల్లులు కురిశాయి. ఆకాశంలో మబ్బులు వస్తున్నందున వర్షం పడేలా ఉందని రైతులు పంటలను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షం పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కలవరపడుతున్నారు.

జోరుగా పనులు..

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పత్తితీత పనులు, వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో అధికంగా సిర్పూర్(టి) నియోజకవర్గంలో వరి సాగు అధికంగా ఉంది. వర్షాలు అనుకూలంగా ఉండడంతో వరి దిగుబడి బాగానే వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు 60 శాతం వరి కోతలయ్యాయి. మిగతా 40శాతం కోతలు కావాల్సి ఉంది. పత్తితీత పనులు సైతం జోరుగా కొనసాగుతున్నాయి. మొదటి విడత పత్తితీత కాగా కొందరు మొదటి పత్తి సైతం తీయకుండా ఉన్నారు. కూలీల కొరత కారణంగా పత్తితీత పనులు ఆలస్యం అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. కోసిన ధాన్యం కల్లాలకు తరలించి ఆరబెడుతున్నారు. ఫెంగల్ తుపాను కారణంగా మబ్బులు వస్తున్నందున రెండు రోజుల నుంచి ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి కాపాడుకుంటున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబరు నుంచి వర్షాలు కురువక పోవడంతో పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో లేదు. దీంతో అకాల వర్షాలు పడితే మరింత నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలు కురిస్తే అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



భక్తులకు హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాస ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, నైవేద్యాలు, పట్టువస్త్రాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్‌లు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళ అదృశ్యం

జైనూర్: మండలంలో పంచాంగం చెబుతూ జీవనం సాగిస్తున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని గోసంపల్లి గ్రామానికి చెందిన గడ్డం ఎల్లవ్వ, గడ్డం లక్ష్మి అనే తల్లీకూతుళ్లు జాతకం చెబుతుంటారు. ప్రతీ 15 రోజులు జైనూర్ మండలంలో, మిగితా 15 రోజులు సొంతూరుకు వెళ్తారు. గత నెల 29న తల్లి గడ్డం ఎల్లవ్వ జాతకం చెప్పడానికి వేరే ఊరికి వెళ్లగా కూతురు కన్పించకుండా పోయింది. అయితే మండల కేంద్రానికి చెందిన మండలి రాజు లక్ష్మితో మాట్లాడేవాడని అతనిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

తిర్యాణి(ఆసిఫాబాద్): భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని, ఇందుకోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని కుమురంభీం కమ్యూనిటీ హాల్ ఆదివారం సమావేశం నిర్వహించారు. 60 ఏళ్లు పైబడిన కార్మికులకు రూ.6వేల పింఛన్ అందించాలని, రూ.10లక్షల జీవిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కిన్నక జంగు, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిళి, దేవేందర్, వెంకటేశం చారి, సత్తయ్య, హరీశ్, శంకర్, గట్టయ్య తదితరులు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

తిర్యాణి: మండలంలోని ఏజెన్సీ గ్రామం తోయగూడెంలో ఆదివారం సేవాలాల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 37 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సిద్ధి వీరేశం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ట్రస్టు సేవలను మరింత విస్తరింపజేయాలన్నారు. విద్య, వైద్యం విషయంలో అభివృద్ధి సాధించడం కోసం అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందాలన్నారు. అనంతరం పులి సంచారం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీట్ అధికారులు అనిల్, ప్రకాశ్, గ్రామ పెద్దలు ఉన్నారు.